సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం । 24 । జూన్ । 2023



రెండోడిపోను సందర్శించిన ఈడీ

విద్యానగర్: కరీంనగర్–2డిపోను ఆర్టీసీ జోన్ ఈడీ వినోద్‌కుమార్ సందర్శించారు. డిపోను లాభాల్లోకి తేవాలన్నారు. డిప్యూటీ డివిజన్ మేనేజర్ భీమ్‌రెడ్డి, మేనేజర్ మల్లయ్య పాల్గొన్నారు.



పత్తిధర రూ.7,150

జమ్మికుంట: జమ్మికుంటలో పత్తి రూ.7,150 పలికింది. మార్కెట్‌కు 254 క్వింటాళ్ల పత్తిని తెచ్చారు. మోడల్ ధర రూ.7,100, కనిష్ట ధర రూ.6,900 పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలులు తీవ్ర వేగంగా వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

హన్మాజిపేట ఆస్పత్రి పరిశీలన



ఆస్పత్రిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలంలోని హన్మాజిపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్ రావు శుక్రవారం పరిశీలించారు. ఈ ఆస్పత్రిని పూర్తి స్థాయి సిబ్బందితో త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. అన్ని పనులు సకాలంలో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు.

తొలకరి పలకరింపు



ముస్తాబాద్‌లో కురుస్తున్న వర్షం

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎట్టకేలకు వరణుడు కరుణించాడు. పదిహేను రోజులు ఆలస్యంగా తొలకరి పలకరించింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఇన్నాళ్లు తీవ్ర ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలు సాయంత్రం వేళ చల్లటి జల్లులు కురువడంతో ఉపశమనం పొందారు. ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రాల్లో చిన్నపాటి వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో పలు కులసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం వనభోజనాలకు వెళ్తున్నారు.

సకాలంలో బియ్యం అందించాలి



నాగారం మిల్లు తనిఖీ చేస్తున్న భీమ్యానాయక్

కోనరావుపేట(వేములవాడ): రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి సీఎమ్మార్‌ను సకాలంలో అందించాలని అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ సూచించారు. మండలంలో ఇటీవల మొదలైన వినాయక, ఉమామహేశ్వర, సరస్వతీ రైస్‌మిల్లులను శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా మిల్లుల్లో ఉన్న ధాన్యం నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ రవికాంత్, డీటీ నవీన్, సర్పంచ్ వంశీకృష్ణారావు, మిల్లు యజమానులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

బోయినపల్లి(చొప్పదండి): గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని, నేరాల నియంత్రణకు సహకరించాలని వేములవాడరూరల్ సీఐ బన్సీలాల్ కోరారు. మండలంలోని స్తంభంపల్లిలో శుక్రవారం రాత్రి పోలీస్ మీ కోసం కార్యక్రమంలో భాగంగా సీఐ మాట్లాడారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై మహేందర్, ఎంపీటీసీ అక్కెనపెల్లి ఉపేందర్ తదితరులు ఉన్నారు.

ఎకరాకు రూ.10వేలు చెల్లించండి



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: వడగండ్ల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం అందిస్తామని ప్రకటించి మూడేళ్లు గడుస్తున్నా అందించడం లేదని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వెంటనే నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వర్షాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతుబంధు ఇప్పటి వరకు జమ కాలేదన్నారు. వెంటనే రైతులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మిల్లర్లపై సీఎమ్మార్ కత్తి

“ వానాకాలం వడ్లలో నూకశాతం ఎక్కువ. వర్షాలతో వడ్లు తడిసి.. మళ్లీ ఎండడంతో 'రా' రైస్‌మిల్లుల్లో మిల్లింగ్ చేస్తే బియ్యం గింజలు పగిలిపోయి నూకలు ఎక్కువగా వస్తాయి. బాయిల్డ్ మిల్లుల్లో ఈ సమస్య ఉండదు. కానీ అప్పుడేమో వడ్లు బాగా పండినయని మేం వద్దంటున్నా, మిల్లుల్లో జాగ లేకున్నా వడ్లను దింపారు. ఇప్పుడేమో బియ్యం ఇవ్వలేదని జరిమానా చెల్లించాలంటున్నారు. మేం బియ్యం పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. సీఎమ్మార్ చేస్తే మాకు వచ్చేది తక్కువ.. ఖర్చే ఎక్కువ. ఇది ఓ రైస్‌మిల్లర్ వేదన.

- నిర్లక్ష్యం మూల్యం రూ.10 కోట్లు
- 36 రైస్‌మిల్లర్లకు జరిమానా
- 12,490.420 మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగ్
- వడ్లు నాణ్యత లేకనే సమస్య: రైస్‌మిల్లర్లు
- ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తున్నాం: అధికారులు



సిరిసిల్ల రైస్‌మిల్లుల్లో బియ్యం మిల్లింగ్

సిరిసిల్ల: ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకున్న జిల్లాలో కొందరు మిల్లర్లు మర ఆడించి ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. 2021–2022 వానాకాలం సీజన్‌లో తీసుకున్న వడ్లను మర ఆడించి సీఎమ్మార్ ఇవ్వడంలో తీవ్ర జాప్యానికి ప్రభుత్వం భారీ ఎత్తున జరిమానాలు విధించింది. సీఎమ్మార్ ఇవ్వని జిల్లాలోని 36 రైస్‌మిల్లర్లకు రూ.10 కోట్లు జరిమానాలు విధిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే ఆ సీజన్‌లో ఇచ్చిన ధాన్యంలో నాణ్యత లేక బియ్యం సరిగ్గా రాలేవని.. ప్రభుత్వం పునరాలోచించాలని ఆ రైస్‌మిల్లర్లు కోరుతున్నారు.

36 రైస్‌మిల్లర్లపై రూ.10 కోట్ల జరిమానా

జిల్లాలో 2021–2022 వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం రైతుల నుంచి 2,74,559.220 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లర్లకు అందించింది. ఒక్క క్వింటాలు ధాన్యాన్ని ప్రభుత్వం ఇస్తే 67 కిలోల బియ్యాన్ని రైస్‌మిల్లర్లు తిరిగి ఇవ్వాలి. క్వింటాలు బియ్యాన్ని పట్టినందుకు ప్రభుత్వం రూ.15 చెల్లిస్తుంది. ఆ వడ్లలో వచ్చే తవుడు, ఉనుక, నూకలు రైస్‌మిల్లర్లకు మిగులుతాయి. 2021–2022 వానాకాలంలో వరికి అగ్గితెగులు సోకి వడ్లలో నాణ్యత దెబ్బతింది. ఆ ధాన్యం నాసిరకంగా ఉండడంతో నూకలు ఎక్కువగా వచ్చాయని రైస్‌మిల్లర్లు చెబుతున్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) నిబంధనల మేరకు క్వాలిటీ లేకపోవడంతో ఆ బియ్యం రిజెక్ట్ అయ్యాయి. దీంతో సీఎమ్మార్ లక్ష్యం నెరవేరలేదు. 2021–2022 నాటి సీఎమ్మార్ లక్ష్యం ఇంకా 12,490.420 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని జిల్లాలోని 36 రైస్‌మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది.



రైస్‌మిల్లుల ముందు వడ్ల లారీలు (ఫైల్)

జీవో 11 ఏం చెబుతోంది

రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు రైస్‌మిల్లర్లకు నోటీసులు జారీచేసి 2021–2022 నాటి సీఎమ్మార్ బియ్యం ఇవ్వాలని కోరింది. అయినా రైస్‌మిల్లర్లు స్పందించలేదు. చివరి గడువుగా 2023 మార్చి 31లోగా బియ్యం ఇవ్వాలని నిబంధనలు విధించింది. అయినా రైస్‌మిల్లర్లు స్పందించలేదు. దీంతో ప్రభుత్వం మే 23వ తేదీన జీవో నంబరు 11ను జారీ చేసింది. ఈమేరకు 2021–2022 నాటి సీఎమ్మార్ పెండింగ్‌లో ఉన్న బియ్యానికి అదనంగా 25 శాతం బియ్యం ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం 100 క్వింటాళ్లు ఇవ్వాల్సిన రైస్‌మిల్లర్ 125 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాలి. ఇందులో బియ్యంతోపాటు అదనపు 25 శాతానికి సమానంగా డబ్బులను జరిమానాగా చెల్లించాలని జీవో 11లో ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. ఈమేరకు రాజన్నసిరిసిల్ల జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 12,490.420 మెట్రిక్ టన్నుల బియ్యానికి సుమారు రూ.10 కోట్లు రైస్‌మిల్లర్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో 20 శాతం అంటే రూ.2 కోట్లు తక్షణమే చెల్లించాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ జరిమానాలు చెల్లిస్తేనే సీఎమ్మార్ బియ్యం తీసుకుంటామని, వచ్చే ఏడాదిలో మళ్లీ ధాన్యం కేటాయింపులు ఆ 36 రైస్ మిల్లులకు ఉంటాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

బియ్యం పెట్టారు.. కానీ

జిల్లాలోని రైస్‌మిల్లర్లు 2021–2022 నాటి సీఎమ్మార్ బియ్యం పెట్టారు. కానీ మొత్తం బియ్యం ఇవ్వకుండా కొంత జాప్యం చేశారు. ఇందులో అత్యధికంగా రగుడుకు చెందిన వెంకటేశ్వర ఇండస్ట్రీస్ 829.285 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉండగా.. అత్యల్పంగా పదిరకు చెందిన శ్రీలలిత పరమేశ్వరీ ఇండస్ట్రీస్ 56.594 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉంది. జిల్లాలోని రా రైస్‌మిల్లర్లు అందరూ 2021 నాటి కస్టమ్ మిల్లింగ్ బియ్యం ఇవ్వాల్సి ఉంది.

2021-2022 నాటి ధాన్యం కొనుగోళ్ల తీరు ఇలా..

కొనుగోలు చేసిన ధాన్యం	2,74,559.220 మెట్రిక్ టన్నులు
ధాన్యం ఇచ్చిన రైతులు	53,158
ధాన్యం విలువ	రూ.538.14 కోట్లు
ఇవ్వాల్సిన సీఎమ్మార్	1,83,954.677 మెట్రిక్ టన్నులు
ఇచ్చిన సీఎమ్మార్	1,71,464.257 మెట్రిక్ టన్నులు
పెండింగ్ సీఎమ్మార్	12,490.420 మెట్రిక్ టన్నులు
సీఎమ్మార్ ఇవ్వాల్సిన మిల్లులు	36
విధించిన జరిమానా	రూ.10 కోట్లు
తక్షణమే చెల్లించాల్సిన మొత్తం	రూ.2 కోట్లు (20 శాతం)

బియ్యం ఇచ్చేందుకు సిద్ధం



2021–2022లో వడ్లు బాగా రాలేదు. ఆ బియ్యం ఎఫ్‌సీఐలో పాస్ కాలేదు. దీంతో ఆలస్యమైంది. మేం ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న బియ్యం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ జరిమానా చెల్లించాలని ఒత్తిడి చేయడం సరికాదు. ఇప్పుడు విధించిన జరిమానాల నుంచి మినహాయింపు ఇవ్వాలి. పెండింగ్‌లో ఉన్న సీఎమ్మార్ బియ్యం వెంటనే ఇస్తాం. జరిమానాలు కట్టే పరిస్థితుల్లో రైస్‌మిల్లర్లు లేరు. ఈ ఒక్క అవకాశం ఇవ్వాలి.

– పబ్బ నాగరాజు, రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ ఆదేశాల మేరకు జరిమానాలు



సీఎమ్మార్ బియ్యం గడువులోగా ఇవ్వాలని రైస్‌మిల్లర్లకు చాలా సార్లు చెప్పాం. కొందరు ఇప్పటికే ఇచ్చారు. జిల్లాలో 36 మిల్లుల్లో మాత్రమే 2021–2022 నాటి సీఎమ్మార్ పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జరిమానాలు విధిస్తున్నాం. ఆ జరిమానాలు ఐదు దఫాలుగా చెల్లించే వెసులుబాటు ఉంది. జిల్లాలో రూ.10 కోట్ల మేరకు జరిమానాలు విధించాం. ”

– ఎస్.భీమ్యానాయక్, అదనపు కలెక్టర్

నేడు జిల్లా వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్‌ఇన్



సిరిసిల్ల: వర్షాకాలం కరిగిపోతుంది. కార్తెలు వెళ్లిపోతున్నాయి. వానాకాలంలో జిల్లాలో చినుకు జాడలేదు. రైతులు ఇప్పుడిప్పుడే నార్లు పోశారు. ఎండలు మండిపోతున్నాయి. రేగడి భూముల్లో విత్తిన పత్తి విత్తనాలు వట్టిపోయే ప్రమాదం ఉంది. జిల్లాలో వానాకాలం వ్యవసాయానికి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి తరుణంలో రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఎలాంటి విత్తనాలను ఎంచుకోవాలి.. వర్షాలు ఆలస్యమైతే.. ఏ పంటలు వేసుకోవాలి.. ప్రస్తుత పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటి? అనే అంశాలతోపాటు రైతులకు వచ్చే అన్ని సందేహాలకు సమాధానం ఇచ్చేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయాధికారి వి.భాస్కర్‌తో శనివారం 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తుంది. రైతుల సందేహాలకు జిల్లా వ్యవసాయాధికారి సమాధానాలు ఇస్తారు. జిల్లాలోని రైతులు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలి.

ఫోన్ చేయాల్సిన సమయం : శనివారం
ఉదయం 10 నుంచి 11 గంటలు
ఫోన్ నంబర్ : 72888 94142

పంటల మార్పిడితో లాభాలు



మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేసిన అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఒకే పంట వేసుకోకుండా పంట మార్పిడి చేస్తే రైతులు లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ పేర్కొన్నారు. మండలంలోని గుంటపల్లిచెరువుతండాలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో గిరిజన ఉపప్రణాళికలో భాగంగా మొక్కజొన్న సాగు, యాజమాన్య పద్ధతులపై శుక్రవారం అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ మాట్లాడుతూ మొక్కజొన్న, ఆయిల్‌పామ్ సాగు, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాల గురించి వివరించారు. టార్పాలిన్ కవర్లు, మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేశారు. ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సర్పంచ్ మాలోతు సునీత, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరసింహరెడ్డి, శాస్త్రవేత్తలు మధుకర్‌రావు, శ్రావణి, ఏవో పద్మ, మదన్‌మోహన్ రెడ్డి, ఏవో భూమిరెడ్డి, ఏఈవోలు మసూద్ పాషా, ముకుంద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి



సిరిసిల్ల మున్సిపల్ ముందు ధర్నా చేస్తున్న మహిళలు

సిరిసిల్లటౌన్: అర్హులైన పేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. చాలా రోజులుగా డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులతో కలిసి శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ ఆఫీస్ ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. పదేళ్లుగా పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పిన కేసీఆర్ మాటను నిలుపుకోలేక పోతున్నారన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు రాని పేదలకు నివేశన స్థలంతోపాటు రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఎగమంటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, శ్రీరామ్ సదానందం, ఎలిగేటి రాజశేఖర్, గోవిందు లక్ష్మణ్, బెజ్జగం సురేష్, ఒగ్గు గణేష్ పాల్గొన్నారు.

అనాథ పిల్లలపై నిర్లక్ష్యం చూపించొద్దు

సిరిసిల్లటౌన్: అనాథ పిల్లలపై రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యం చూపించొద్దని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి ఆవునూరి ప్రభాకర్ అన్నారు. అనాథ పిల్లల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనాథ పిల్లలకోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది అనాథ పిల్లల కోసం రూ.1000 కోట్లు ఖర్చు చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవో గంగయ్యకు పిల్లలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ నాయకులు ఖానాపురం లక్ష్మణ్, గుండా థామస్, మ్యాకల చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, ధనుంజయ్ పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయసేవలు

- జిల్లా న్యాయమూర్తి ప్రేమలత
- లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రారంభం
- వర్చువల్‌గా ప్రారంభించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్



లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రారంభంలో జడ్జీలు

సిరిసిల్లటౌన్: పేదలకు ఉచిత న్యాయసేవలు అందించడమే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రధాన లక్ష్యమని జిల్లా న్యాయమూర్తి ప్రేమలత పేర్కొన్నారు. రాష్ట్రంలోని 17 కోర్టుల్లో ఎల్‌డీసీ సిస్టమ్‌ను శుక్రవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. సిరిసిల్లలో జిల్లా జడ్జి మాట్లాడుతూ ఆర్థికంగా లేని పేదలకు న్యాయసేవలపై డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు ఉచితంగా వాదిస్తారని తెలిపారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది పర్శరాములు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాదిగా పెంట శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, జూనియర్ సివిల్ జడ్జీలు రవీందర్, హిమబిందు, జ్యోతిర్మయి, ఏఎస్పీ చంద్రయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, లోక్‌అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మారని 'మధ్యాహ్నం' మెనూ

- పాత మెనూ ప్రకారమే భోజనం
- కాగితాలకే పరిమితమైన ఉత్తర్వులు
- ఖరారు కాని టెండర్లు
- అందని గౌరవ వేతనం
- అవస్థల్లో వంట కార్మికులు

జిల్లాలో విద్యార్థుల వివరాలు

పాఠశాల	విద్యార్థులు
ప్రాథమిక	22,343
ప్రాథమికోన్నత	3,681
ఉన్నత పాఠశాల	15,912



పాఠశాలలో భోజనం తయారు చేస్తున్న వంటకార్మికులు

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ స్కూళ్లలో డ్రాపౌట్స్ తగ్గించడం.. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తుంది. ఈ విద్యాసంవత్సరం నుంచి మధ్యాహ్న భోజనం మెనూ మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడా కొత్త మెనూ అమలుకావడం లేదు. పాత మెనూ ప్రకారమే కూరలు వండి పెడుతున్నారు. మధ్యాహ్న భోజనం తయారీకి అవసరమైన సామగ్రి సరఫరాకు టెండర్లు పిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇప్పటికీ టెండర్ల విషయాన్ని అధికారులు మరిచిపోయినట్లు ఉన్నారు. కొత్త మెనూ అమలులోకి వస్తే మధ్యాహ్న కార్మికులు దుకాణాలు వెళ్లి సామగ్రి కొనాల్సిన అవసరం ఉండదు. కాంట్రాక్టర్ సామగ్రి సరఫరా చేస్తే కార్మికులు వంట వండి వడ్డించాల్సి ఉంటుంది.

జాడలేని టెండర్‌లు

గురుకులాలు, కేజీబీవీలకు టెండర్‌దారులు నేరుగా సరుకులు అందిస్తున్నారు. భోజనం తయారు చేసినందుకు కార్మికులు గౌరవ వేతనం అందుకుంటున్నారు. ఇదే విధానాన్ని మధ్యాహ్న భోజనానికి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రోజువారీగా ఏ ఆహారాన్ని అందించాలి వాటికి కావాల్సిన సామగ్రి ఏమిటి అనేది స్పష్టంగా వెల్లడించింది. రోజు మిక్సుడ్ వెజిటబుల్ కర్రీ ఉండాలని దీనికి అదనంగా సోమవారం కిచిడి, గుడ్డు, మంగళవారం అన్నం, సాంబార్, బుధవారం అన్నం, ఆకుకూర, పప్పు, గుడ్డు, గురువారం వెజిటబుల్ బిర్యానీ, శుక్రవారం అన్నం సాంబార్, గుడ్డు, శనివారం అన్నం, ఆకుకూర, పప్పు పెట్టాలని ఉంది.

వంటకు అవరోధాలు అనేకం

ప్రస్తుతం ఉన్న ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మధ్యాహ్న భోజనం తయారీకి ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి అందించే డబ్బుతో తయారు చేయలేని పరిస్థితి ఉందని కార్మికులు గతంలోనే అనేక సార్లు అధికారులకు విన్నవించారు. గతంలో ఉన్న మెనూ పాటించడం సాధ్యం కాదని అంటుంటే మళ్లీ బిర్యాని అని, వారానికి మూడుసార్లు గుడ్డు పెట్టాలన్న తాజా నిబంధనలు పాటించడం కుదరదని తెగేసి చెబుతున్నారు. ఫిబ్రవరిలో పెంచినట్లు ప్రకటించిన గౌరవ వేతనం రూ.3 వేలు అమలుకావడం లేదని వాపోతున్నారు. అంతేకాదు నాలుగు నెలలుగా చేసిన పనికి వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంట సరుకుల సరఫరా కష్టమే..

గురుకులాలు, కేజీబీవీల్లో విద్యార్థుల వందల సంఖ్యలో ఉంటారు. జిల్లాలో ఆ విద్యాసంస్థల సంఖ్య పరిమితంగా ఉంది. టెండర్‌దారులు వాటి కేటాయింపులకు పోటీపడే అవకాశాలున్నాయి. కానీ పాఠశాలల విషయానికొస్తే టెండర్ వేసిన వ్యక్తి ప్రతీ గ్రామానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇదంతా సాధ్యమయ్యే పని కాదన్న అభిప్రాయాలు ఉన్నాయి. దీని కారణంగానే ఇంకా ప్రభుత్వం మధ్యాహ్నం భోజన సరుకుల సరఫరాకు సంబంధించిన టెండర్లు వేయడం లేదని తెలుస్తోంది. కొన్ని గ్రామాలు, తండాలలో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో 20 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా ప్రాంతాలకు రోజూ వెళ్లి సరుకులు సరఫరా చేయడం టెండర్‌దారులకు నష్టం వస్తుందని వివరణలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులను విద్యాశాఖ అధికారులు ఎలా అధిగమిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

పాత ధరలతో కొత్త మెనూ కష్టం

ఇప్పటి వరకు ఇస్తున్న ధరల ప్రకారం కొత్త మెనూ తయారు చేయడం కష్టమని ఉపాధ్యాయులు, కార్మికులు పేర్కొంటున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో కూర వండినందుకు ఒక్కో విద్యార్థి వెంట రూ.5.45, ప్రాథమికోన్నత విద్యార్థులకు రూ.8.17, తొమ్మిది పదోతరగతి విద్యార్థులకు రూ.9.95 చెల్లిస్తున్నారు. ఇప్పుడు నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని, ఈ ధరలతో భోజన తయారీ సాధ్యం కాదని కార్మికులు వాపోతున్నారు. సరుకులు ఇస్తే వంట చేయడం సులభమంటున్నారు. అంతకంటే ముందు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

ఫైల్ ప్రాసెస్‌లో ఉంది



మధ్యాహ్న భోజన పథకం గతంలో మాదిరి ఇప్పుడు నడుస్తుంది. వంట సరుకుల సరఫరా టెండర్‌కు సంబంధించిన ఫైల్ ప్రాసెస్‌లో ఉంది. ఇప్పుడు మాత్రం విద్యార్థులకు గత విధానంలో భోజనం అందుతుంది. టెండర్ విధానం పూర్తి చేశాక నూతన మెనూ పాటించేలా చర్యలు తీసుకుంటాం.

– రమేశ్, డీఈవో

క్లుప్తంగా

కరపత్రాల పంపిణీ


కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలే చేపట్టిందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో ఇంటింటా తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్ర పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందాయన్నారు. కరోనా సమయంలో ప్రజలకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. ఆయనవెంట నాయకులు సాయి, పొత్తూరి నరేశ్, కుమ్మరి శివ, గణేశ్ తదితరులున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై ప్రేమ్‌దీప్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని హరిదాస్‌నగర్‌కు చెందిన తాళ్లపల్లి రవి గతనెలలో సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ ద్వారా గుర్తించగా శుక్రవారం బాధితుడికి ఎస్సై ప్రేమ్‌దీప్ ఫోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..ఎవరైనా సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

గుడుంబా తయారీదారుల బైండోవర్


గుడుంబా విక్రేతను చూపుతున్న పోలీసులు

కోనరావుపేట: గ్రామాల్లో గుడుంబా విక్రయిస్తే చర్యలు తప్పవని చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని గోవిందరావుపేట తండా (బావుసాయిపేట)లో శుక్రవారం పోలీసుల తనిఖీలు నిర్వహించారు. అజ్మీరా కిషన్, అజ్మీరా సంతోష్ వద్ద గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. ఇద్దరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో గుడుంబా తయారీని మానుకొని ప్రత్యామ్నాయం చూసుకోవాలన్నారు. ఎస్సైలు రమాకాంత్, ప్రభాకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు జగన్నాథ రథయాత్ర

జగిత్యాలటౌన్ : ఇస్కాన్ మెట్‌పల్లి ఆలయ కేంద్రం, జగిత్యాల ఇస్కాన్ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో శనివారం జగిత్యాలలో జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శుభమస్తు ఫంక్షన్‌హాల్ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా రథయాత్ర కొనసాగుతుందన్నారు. హరినామ సంకీర్తనలతో సాగే జగన్నాథ రథయాత్రలో హిందూ బంధువులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఇస్కాన్ ప్రచార కేంద్ర ప్రతినిధులు డా నరహరిదాస్. జరుపుల శ్రీనివాస్ కోరారు.

మార్కెట్ కమిటీలో ఖాళీలు

- తొమ్మిది మార్కెట్ కమిటీలకు ఐదుగురే ఉద్యోగులు
- మిగతా అంతా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే
- పదేళ్లుగా నియామకాలు చేపట్టని ప్రభుత్వం

వేములవాడ మార్కెట్ ఆదాయ వివరాలు

2018–19	రూ. 1,39,12,718
2019–20	రూ. 2,10,66,562
2020–21	రూ. 2,61,90,599
2022–23	రూ. 3,17,22,500


మార్కెట్ కమిటీ కార్యాలయం, వేములవాడ

వేములవాడ రూరల్: జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో గత పదేళ్లుగా ఉద్యోగుల నూతన నియామకాలు లేకపోవడంతో కొంతమంది ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడకముందు జిల్లాలో కేవలం మూడు మార్కెట్ కమిటీలు ఉండేవి. వేములవాడ, సిరిసిల్ల, పోత్గల్‌లో ఉండగా రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రత్యేకంగా సిరిసిల్లలో మరో 5 మార్కెట్ కమిటీలు ఏర్పడ్డాయి. జిల్లా ఏర్పాటైన నుంచి ఉద్యోగ నియామకాలు జరగలేదు. జిల్లాలో 8 మార్కెట్ కమిటీలుండగా ఇటీవల ప్రభుత్వం నూతనంగా ఏర్పడిన వీర్నపల్లి మండలానికి కూడా మార్కెట్ కమిటీని మంజూరు చేసింది. ప్రస్తుతం జిల్లాలో 9 మార్కెట్ కమిటీలు ఉన్నా ఐదుగురు ఉద్యోగులే ప్రస్తుతం కొనసాగుతున్నారు. మిగతా ఔట్ సోర్సింగ్ సిబ్బందితోనే వెల్లదీస్తున్నారు.

జిల్లాలోని మార్కెట్ కమిటీలు

జిల్లాలో ప్రస్తుతం పోత్గల్, సిరిసిల్ల, వేములవాడ, ఇల్లంతకుంట, గంభీరావుపేట, రుద్రంగి, బొప్పాపూర్, బోయినపల్లితో పాటు కొత్తగా వీర్నపల్లి మండలానికి మార్కెట్ కమిటీని ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసింది. బొప్పాపూర్‌లో ఉన్న వీర్నపల్లిని ప్రత్యేకంగా మార్కెట్ ప్రకటించినా ఇంకా ఎలాంటి కార్యక్రమాలు ప్రారంభం కాలేదు. తొమ్మిది మార్కెట్ కమిటీల్లో వేములవాడ మార్కెట్ కమిటీలో కార్యదర్శితో పాటు సూపర్‌వైజర్ ఉన్నారు. రుద్రంగిలో వాచ్‌మన్, సిరిసిల్లలో కార్యదర్శితో పాటు జూనియర్ సూపరింటెండెంట్ ఉన్నారు. ఐదుగురు ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తుండగా ఈ కార్యాలయాల్లో ఔట్ సోర్సింగ్‌పై తీసుకున్న సెక్యూరిటీ గార్డ్, ఇతర సిబ్బందితో మాత్రమే విధులు కొనసాగిస్తున్నారు. జిల్లాలోనే వేములవాడ మార్కెట్ కమిటీ గ్రేడ్–1, సిరిసిల్ల గ్రేడ్–3గా కొనసాగుతున్నాయి. జిల్లాలోనే వేములవాడ మార్కెట్ కమిటీ ఆదాయంతో పాటు సౌకర్యాల్లో ముందుండి అత్యధిక ఆదాయం వచ్చే మార్కెట్‌గా పేరుంది. ఐదెకరాల స్థలంతో పాటు అన్ని సౌకర్యాలున్నాయి. మార్కెట్‌లో రెండేళ్లుగా ఎలాంటి కార్యకలాపాలు లేకపోవడంతో ప్రస్తుతం వెలవెలబోతోంది. ఉన్న ఐదు ఎకరాల స్థలం నుంచి రెండెకరాల స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు కేటాయించారు. మిగిలిన మూడెకరాల స్థలం రైతులకు సరిపోదని ఎమ్మెల్యే రమేశ్ బాబు ప్రత్యేక చొరవతో నూతన మార్కెట్ యార్డుకోసం మర్రిపల్లి గ్రామ శివారులోని 13 ఎకరాల 20 గుంటల స్థలాన్ని మార్కెట్ కోసం కేటాయించారు. రూ.2కోట్లు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిపాదనలు అందలేదు.

రెండు జిల్లాలకు ఒకే అధికారి

రాజన్న సిరిసిల్ల జిల్లా, పెద్దపల్లి జిల్లా మార్కెటింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అధికారి రెండు జిల్లాలకు ఒక్కరే ఉన్నారు. పెద్దపల్లి జిల్లా మార్కెట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌రెడ్డిని జిల్లా ఇన్‌చార్జి అధికారిగా దాదాపు సంవత్సరం క్రితం నియమించారు. ఇప్పటి వరకు మళ్లీ ఎవరిని నియమించకపోవడంతో ప్రస్తుతం రెండు జిల్లాలకు ఒక్కరే కొనసాగుతున్నారు. మార్కెట్ కార్యదర్శులతో పాటు జిల్లా మార్కెట్ అధికారి కూడా ఇన్‌చార్జిగానే ఉండడంతో ఉద్యోగులపై అదనపు భారం పడుతోంది.

మర్రిపల్లిలో ఏర్పాటు చేస్తాం



వేములవాడ మార్కెట్ యార్డును మర్రిపల్లి గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేస్తాం. దీనికోసం ఇప్పటికే స్థలాన్ని గుర్తించాం. నిర్మాణం కోసం ప్రభుత్వానికి రూ.2కోట్లతో ప్రతిపాదనలు పంపాం.

– సత్యనారాయణ, ఏఎంసీ కార్యదర్శి, వేములవాడ

నివేదిక అందించాం



జిల్లాలో ప్రస్తుతం తొమ్మిది మార్కెట్ కమిటీలున్నాయి. అందులో ఉద్యోగుల వివరాలు, ఖాళీల సంఖ్యను మార్కెటింగ్ డైరెక్టర్ ఆఫ్ హైదరాబాద్‌కు పంపించాం. ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయగానే నూతన నియామకాలు పూర్తిచేస్తాం.

– ప్రవీణ్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి

యువకుడి ఆత్మహత్యా యత్నం

కోనరావుపేట: తన భూమిలో వేసిన బోరుపై ఇతరులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ యువ రైతు ఆత్మహత్యా యత్నానికి యత్నించాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మర్తనపేట గ్రామానికి చెందిన గుర్రం చిన్న రాజిరెడ్డి కుమారుడు నవీన్ (30) గ్రామ శివారులోని తనకున్న నాలుగెరాల భూమిలో వారం రోజులక్రితం బోరువేశాడు. ఇదే గ్రామానికి చెందిన భూ యజమానులు శ్రీనివాసరావు, రఘుపతిరావు తమ బోరుకు దగ్గరగా బోరు వేసి వాల్టా చట్టాన్ని ఉల్లంఘించారంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం నవీన్ బోర్ మోటార్‌ను దించేందుకు రాగా విచారణకు వచ్చిన ఆర్‌ఐ మోటార్ వైరును కట్‌చేశారు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి యత్నించాడు. చికిత్స నిమిత్తం సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లి మూలవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. గ్రామ శివారులోని మూలవాగులో ఇసుకను తరలించుటకు ప్రయత్నిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్లు జవ్వాజి శ్రీనివాస్, జవ్వాజి అజయ్, యజమానులు జంకె మధు, జవ్వాజి నారాయణపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ట్రాక్టర్, జేసీబీ యజమానులపై కేసు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాల శివారులో అక్రమంగా ఇసుక తవ్వుతూ, రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. నర్మాల శివారులో జేసీబీ, రెండు ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకొని వాహనాల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వెంకట్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

- రాతితో విగ్రహాన్ని చెక్కిన కొమురయ్య
- నాలుగేళ్లుగా గదిలోనే బందీ
- విగ్రహ ఏర్పాటుకు గతంలో పాలకవర్గ సభ్యులు,
- గ్రామస్తుల తీర్మానం


రాతితో చెక్కిన వెంకట్ రెడ్డి విగ్రహం

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన దివంగత సిరిసిల్ల సమితి మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ నేవూరి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కలగానే మిగిలింది. మండల ప్రజలకు విస్తృత సేవలందించిన బాపుగా పిలిచే వెంకట్ రెడ్డి విగ్రహాన్ని స్థానికంగా ఏర్పాటు చేయాలని గతంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు తీర్మానించారు. విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించారు. అయితే స్థానికంగా ఉండే జవ్వాజి కొమురయ్య రాతితో వెంకటరెడ్డి విగ్రహాన్ని చెక్కాడు. ఏర్పాటులో జాప్యం జరుగుతుండడంతో చెక్కిన విగ్రహం ఓ గదిలో నాలుగేళ్లుగా బందీగానే ఉండిపోయింది. వెంకట్ రెడ్డి జిల్లా ప్రజలకు, ఎల్లారెడ్డిపేట గ్రామస్తులకు ఎన్నో సేవలందించారు. ఇప్పటికైనా వెంకటరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామాభివృద్ధి కోసం నిస్వార్థంగా సేవలందించిన వెంకట్ రెడ్డి విగ్రహాన్ని బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తోట ఆగయ్య

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామానికి చెందిన కేసవేణి నర్సయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. అల్మాస్‌పూర్‌లో బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఆయన పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి అన్నివిధాలా సాయం అందిస్తామన్నారు. మృతుడికి భార్య లక్ష్మీ, కుమారులు శ్రీనివాస్, సురేశ్ ఉన్నారు. ఎంపీపీ పిల్లి రేణుక, నాయకులు కిషన్, కమాలాకర్ రెడ్డి, పెద్దూరి కిష్టయ్య, దేవయ్య, కిష్టయ్య, రాములు, బడే రమేశ్, నర్సయ్య, అంజయ్య, తదితరులున్నారు.

రైస్‌మిల్లులో అగ్ని ప్రమాదం

ధర్మపురి : మండలంలోని ఓ రైస్‌మిల్లులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తిమ్మాపూర్ సమీపంలో కొంతకాలంగా శ్రీనివాస పారాబాయిల్డ్ రైస్ మిల్‌ను నిర్వహిస్తున్నారు. రోజూ మాదిరిగానే గురువారం రాత్రి ధాన్యాన్ని పైకి తీసుకెళ్లే క్రమంలో ఎలిమేటర్‌లో మంటలు చెలరేగాయి. దీంతో కూలీలు అక్కడినుంచి ఉరుకులు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలానార్పారు. మొదట ధాన్యం పైకి తీసుకెళ్లే పైపులోపల మంటలు బయటకు కనిపించలేదు. పైనున్న ఎలిమేటర్‌లో మంటలు కనిపించాయని దీంతో పైపులో ఉన్న వస్తువులన్నీ అప్పటికే కాలిపోయాయని యజమాని సాయిని శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.15 లక్షల విలువగల వస్తు సామగ్రి దగ్ధమైనట్లు ఆయన తెలిపారు.

టేకు కలప స్వాధీనం



సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం టేకు చెట్లను నరికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా సర్పంచ్ అర్గె లక్ష్మీ ఆధ్వర్యంలో కలపను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అటవీశాఖకు సమాచారం ఇచ్చారు. అటవీ ప్రాంతంలో సదరు వ్యక్తులు విలువైన మూడు టేకు చెట్లను నరికి వాటిని తరలించేందుకు యత్నిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు.

దాడి ఘటనలో ముగ్గురి రిమాండ్

ధర్మపురి : పాత కక్షలను మనుసులో పెట్టుకొని కత్తితో దాడిచేసిన సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దత్తాత్రి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణానికి చెందిన ముప్పట్ల నిరంజన్, బత్తిని వినయ్‌కు ఇదే పట్టణానికి చెందిన గుర్రాల గణేశ్, కోట రాజన్న, మేకల గంగాధర్‌కు పాతకక్షలున్నాయి. ఈనెల 10న ముప్పట్ల నిరంజన్, బత్తిని వినయ్ సంతలో చిట్టి వసూలు చేస్తుండగా గుర్రాల గణేశ్, కోట రాజన్న, మేకల గంగాధర్ కత్తితో దాడి చేశారు. నిరంజన్, వినయ్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీనిపై నిరంజన్ సోదరుడు గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై కేసునమోదు చేశారు. అప్పటినుంచి వారు తప్పించుకొని తిరుగుతుండగా శుక్రవారం ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మత ప్రచారాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెలో ఓ మతానికి చెందినవారు మతానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తుండగా గ్రామానికి చెందిన యువకులతో పాటు, మండలంలోని బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. గ్రామంలో ఓ మతానికి చెందిన దాదాపు 50 మంది వరకు గ్రామంలో ర్యాలీగా తమ మతంలో చేరాలని ప్రచారం నిర్వహిస్తూ ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటా తిరిగి ప్రచారం చేయడం సరికాదని బీజేపీ నాయకులు దీనిని అడ్డుకున్నారు. దీంతో సదరు మత ప్రచారకులు, బీజేపీ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. బీజేపీ నాయకులు ఒకరిపై దాడి చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఇద్దరికి సర్దిచెప్పడంతో పాటు మత ప్రచారకులను పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఉప్పల శ్రీనివాస్‌కు ‘యోగియోగ’ అవార్డు


అవార్డు అందుకుంటున్న ఉప్పల శ్రీనివాస్

సిరిసిల్ల కల్చరల్: పట్టణానికి చెందిన ప్రముఖ యోగాచార్యుడు ఉప్పల శ్రీనివాస్‌కు తమిళనాడుకు చెందిన సంస్థ ప్రత్యేక అవార్డు అందజేసింది. దశాబ్ద కాలంలో సుమారు 6 వేల మందికి యోగా సాధనలో శిక్షణనిస్తూ సేవలందిస్తున్నందున ‘యోగి యోగ’ బిరుదును బహూకరిస్తున్నట్లు ఆ సంస్థ తరపున అవార్డు అందించిన జిల్లా న్యాయమూర్తి ఎస్ ప్రేమలత తెలిపారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేస్తూ విద్యార్థుల్లో యోగాపై ఆసక్తిని పెంచడంతో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఆయా విద్యార్థులు రాణించేలా కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ప్రేమలత అభినందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, ప్రతినిధులు ఎస్.అనిల్‌కుమార్, ఏజీపీ రవీందర్, జక్కని వెంకట్రాజం, గంగాధర్, అల్లాడి శ్రీనివాస్, యాద రమేశ్, బిల్ల శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రీదేవి, చంద్రకళ పాల్గొన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కెం నాగరాజు పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేవన్నారు. పాఠశాలలు పునర్ ప్రారంభమై మూడు వారాలు గడుస్తున్నా వసతులు కల్పించలేదన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులతో తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్న ప్రభుత్వం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తోందన్నారు. మోడల్‌స్కూల్స్, కస్తూర్బా, జెడ్పీ పాఠశాలల్లో కనీస వసతులు లేవన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.5,300 కోట్లు ఇప్పటికీ విడుదల చేయలేదన్నారు. విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. సమస్యల సాధన కోసం విద్యార్థులకు అండగా నిలుస్తుందన్నారు. అక్యారి మహేశ్, ప్రశాంత్, ప్రకాశ్, రాజు, ఫణి కిషోర్, శివకుమార్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్ల మోదీ పాలనలో దేశాభివృద్ధి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్


జోగాపూర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్

చందుర్తి(వేములవాడ): మోదీ తొమ్మిదేళ్ల పాలనలోనే దేశం అభివృద్ధి చెందిందని, అన్నివర్గాల ప్రజలు మోదీ పాలనకు ఆకర్షితులయ్యారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేశ్ పేర్కొన్నారు. చందుర్తి మండలం జోగాపూర్‌లో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్ ఆధ్వర్యంలో గడపగడపకూ ప్రచారం చేపట్టారు. రమేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు సీఎం కేసీఆర్ పేరిట ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మోసాలను ప్రజలు గుర్తించారని, కేంద్రంలో బీజేపీ తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను మళ్లీ పార్టీ గెలిపిస్తాయన్న ధీమా వ్యక్తం చేశారు. అయోధ్య పర్శరాములు, తుప్పటి పర్శరాములు, బిల్లా నరేశ్, పల్లి ప్రశాంత్, గడ్డం శ్రీకాంత్, మామిడి సురేశ్, వట్టెం రాజు, నాగం ఎల్లయ్య, మొగిలి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నా భర్తను కాపాడండి

- దువాకత్తార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోహన్ నాయక్
- ఉపాధి కోసం ఏడాది కిత్రం వెళ్లిన వైనం
- ఆదుకోవాలని భార్య వేడుకోలు



హాస్పిటల్‌లో మోహన్, ఆర్థిక సాయం కోసం వేడుకుంటున్న కుటుంబ సభ్యులు

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలంలోని భూక్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని రాశిగుట్టతండాకు చెందిన రమావత్ మోహన్ నాయక్(32) గతేడాది దువాకత్తార్ వెళ్లాడు. వారం రోజులుగా ఇంటికి ఫోన్ చేయకపోవడంతో అతని భార్య రమావత్ కవిత అక్కడున్న మోహన్ మిత్రులకు ఫోన్ చేసి మాట్లాడింది. మోహన్‌నాయక్ కాలేయ వ్యాధితో బాధపడుతూ హాస్పిటల్ చేరడని అక్కడి వారు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తన భర్తకు ప్రాణభిక్ష పెట్టాలని మంత్రి కేటీఆర్, దాతలను కోరుతుంది. దాతలు ఆర్థిక సహాయం కోసం ఫోన్‌పే, గూగుల్ పే 9949415677లో సంప్రదించగలరు.

నేడు స్వగ్రామానికి వలసజీవి మృతదేహం


దుబాయిలో మృతిచెందిన యువకుడికి నివాళి అర్పిస్తున్న సత్యం, ప్రవాస తెలంగాణ వాసులు

- మృతదేహం రావడానికి సహకరించిన ఎన్నారై సత్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలకేంద్రానికి చెందిన శివయ్యగారి నవీన్(29) గత సోమవారం దుబాయిలో గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. నవీన్ చనిపోయిన విషయాన్ని సింగిల్‌విండో చైర్మన్ గుండారం కృష్ణారెడ్డి ఎన్నారై సత్యం దృష్టికి తీసుకెళ్లారు. త్వరగా మృతదేహాన్ని పంపించేలా సహకరించాలని కోరారు. స్పందించిన సత్యం దాదాపు రూ.2లక్షల వరకు సొంతంగా ఖర్చు పెట్టుకొని ఐదు రోజుల్లోనే మృతదేహం స్వగ్రామానికి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. నవీన్ మృతదేహం శనివారం ఎల్లారెడ్డిపేటకు చేరుకోనుంది. కాగా నవీన్‌కు గతేడాది వివాహమైంది. భార్యతో సహా దుబాయికి వెళ్లాడు. చిన్న వయస్సులోనే గుండెపోటుతో మృతిచెందడంపై స్థానికులు విషాదంలో ఉన్నారు. మృతుడికి తండ్రి నర్సయ్య, తల్లి నర్సవ్వ ఉన్నారు.